# సంఘం - వర్గం

కాంగ్రెసువారు ఐక్యతను గురించి మాట్లాడుతూ సంఘంలో భిన్న వర్గాలు లేనట్లు మాట్లాడినట్లే, తీవ్రవాదులు వర్గాల సంగతి మాట్లాడుతూ వీటన్నిటినీ కూడగట్టుకొని అభివృద్ధి చెందుతున్న సంఘంఅనేది లేనట్లు మాట్లాడుతున్నారు.

ఈమధ్య ఒక రచయిత తన పుస్తకంలో "ఇది మధ్య తరగతికి వ్రాసిన పుస్తకం" అని వ్రాశాడు.

ఒక తరగతికి వ్రాయటం ఏమిటీ? ఆ తరగతికి తప్ప మరెవ్వరూ చదవగూడదనా? చదివినా ప్రయోజనం లేదనా? ఈదృష్టి వర్గాలనుతప్ప వాటిని ఇముడ్చుకొనివున్న సంఘాన్ని మరచిపోవటంవల్ల వొచ్చింది. ఆ సమస్య ప్రత్యేకం ఒక వర్గానికి చెందిందే కావచ్చు. కాని మొత్తం సంఘానికి సంబంధించిందికూడా! ఆ సమస్యలవల్ల ప్రత్యేకం ఒక తరగతి బాధపడుతూ వుండవచ్చు. కాని మొత్తం సంఘం కూడా దానివల్ల కలవర పడుతూనే వుంటుంది.

సంఘాన్ని ముక్కలుగానే గాక ఒకటిగాకూడా చూడలేకపోవటం వల్ల వొచ్చిన చిక్కు యిది.